వెంటనే విశాఖ స్టీల్ ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విశాఖ స్టీల్ ప్లాంట్ నూరు శాతం అమ్మాలనే కేంద్ర బిజెపి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం 700 రోజులకు చేరిన సందర్భంగా కలక్టరేట్ వద్ద శనివారం ఏఐటియుసి, సిఐటియు సంఘీభావాన్ని తెలియజేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, మాట్లాడుతూ 32మంది ప్రాణ త్యాగం చేసి వేలాది మంది ప్రజలు భూములు త్యాగం చేస్తే వచ్చిన ఉక్కు ఫ్యాక్టరీని ఇప్పుడు కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీలును దొడ్డిదారిన బలహీన పర్చడానికి కుట్ర పన్ను తుందన్నారు. స్టీల్ ప్లాంట్కు గుండెకాయలాంటి బ్లాస్ట్ ఫర్నేష్-3ను 14 మాసాల నుంచి, మూసివేసిందని విశాఖ స్టీల్ ప్లాంట్లోని అనేక విభాగాల్లో ఉత్పత్తి తగ్గించింది. ప్లాంట్ పూర్తి సామర్థ్యం తగ్గించి నష్టాలు వచ్చే విదంగా చేస్తుందన్నారు విశాఖ స్టీల్ ప్లాంట్కు బిడ్ నెం.1గా వచ్చిన రాజస్థాన్ మైన్స్ను విశాఖ స్టీల్ ప్లాంట్ కొనకుండా కేంద్ర ప్రభుత్వం , అడ్డుపడిందని ,విశాఖ స్టీల్ ప్లాంట్ ఒక్కదానికే ల్ రైల్వే ర్యాక్ లు ఇవ్వకుండా కేంద్రం అడ్డుపడడం అన్యాయం అన్నారు .కోవిడ్ ను అడ్డంపెట్టుకొని కార్మికులకు ప్రమోషన్లు పూర్తిగా ఆపేశారని. ఈ సమస్యలను పరిష్కరించవలసిన డైరెక్టర్ పర్సనల్ రెండేండ్ల నుంచి లేరన్నారు.ఉత్పత్తి చూడవలసిన డైరెక్టర్ అపరేషన్ను ఎందుకు కేంద్ర ప్రభుత్వం, నియమించలేదని ప్రశ్నించారు. స్టీల్ ఉత్పత్తి గురించి తెలియని అధికార్లను తెచ్చి సిఎండిగా విశాఖ స్టీల్ప్లాట్పై కేంద్ర ప్రభుత్వం రుద్దిందని. ప్లాంట్ను నష్టాల్లో చూపించి తొందరగా పోస్కోకు, కార్పొరేట్లకు అమ్మాలనే దుర్మార్గమైన కుట్ర కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. కార్య క్రమంలో, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పురం అప్పారావు, నాయకులు శ్రీరాములు, శ్రీను, నాయుడు, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, పట్టణ ఉపాధ్యక్షులు ఆర్.శంకర్ రావు, ఐధ్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ,కె.వి.పి.ఎస్. జిల్లా కార్యదర్శి ఆర్. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెత్తందార్లకు, పారిశ్రామిక వేత్తలకు కొమ్ము కాస్తోంది. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రయివేటీకరణ యత్నాన్ని నిరసిస్తూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు ఆధ్వర్యంలో శనివారం ఎస్.కోటలోని దేవి జంక్షన్ వద్ద కార్మికులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అప్పలరాజు మాట్లా దుతూ విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు సొంత గనులు కేటాయిస్తే భారీ లాభాలతో నడిచేదని స్పష్టం చేశారు. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ పని చేయకుండా నష్టాల సాకును చూపి వేలకోట్ల రూపాయల విలువైన స్టీలు ప్లాంటును, వేలాది ఎకరాల భూమిని కొట్టేసేందుకే ప్రయివేటీకరణ దిశగా పావులు కదుపుతోందని ఆరోపించారు. తమకు తొత్తులుగా ఉన్న పెత్తందారీ పరిశ్రమకు స్టీల్ ప్లాంటును కట్టబెట్టే పథకాన్ని కేంద్రం అమలు చేస్తోందని విమర్శించారు. ఆంధ్రాకు మణిహారంగా ఉన్న స్టీల్ ప్లాంటును కూడా ప్రయివేటీకరణ చేసేసి తాము అధికారంలోకి రాలేని రాష్ట్రానికి దగా చేద్దామన్న బీజేపీ ప్రభుత్వ కుట్ర ఇదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రయివేటీకరణ చేస్తే ఆ ప్రభుత్వ రంగ పరిశ్రమలో పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులకు.. స్టీల్ ప్లాంటుకు వేలాది ఎకరాల భూములను ఇచ్చిన రైతులకు, ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. విశాఖలోని స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న యత్నాన్ని, దానికి సహకరిస్తున్న రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రతిపక్ష పార్టీలు, వామపక్షాలు, ప్రజాసంఘాలతో కలిసి తీవ్ర పోరాటాలు చేసైనా అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖలోని స్టీలు ప్లాంటుకు సొంత గనులు కేటాయించి ప్రయి వేటీకరణ యత్నాలు విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు సూచించారు. ముందుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ యత్నాలకు వ్యతిరేకంగా కార్మికులు కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు మద్ది కృష్ణ, మోపాడ మధు, షేక్ స్వామి, అప్పలరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని ఎఐటియుసి నెల్లిమర్ల నియోజక నాయకులు తాళాడ సన్నిబాబు అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణను నిరసిస్తూ నెల్లిమర్లలో శనివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విశాఖస్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు నిరసిస్తూ ఉద్యమం ప్రారంభించి 700 రోజులు పూర్తయినా కేంద్రానికి చీమకుట్టి నట్లయినా లేదని చెప్పారు. కార్మికులు తిరగబడక ముందే ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని కోరారు.

వైద్యం అందించడంపై నిర్లక్ష్యం వద్దు

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - విజయనగరం : అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చిన వారికి ముందుగా వైద్యం అందించాలని, పేషెంట్ ను చూడకుండానే రిఫర్ చేయకూడదని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పాము కాటు, విషం తీసుకున్నవారు, ప్రమాదాల బారిన పడిన వారు ప్రాణాపాయ స్థితిలో వచ్చిన వారికి తక్షణ వైద్యం చేసే పరిస్థితి ఉండాలని అన్నారు. జిల్లాకు వైద్య కళాశాల మంజూరైనందున ఎక్కువ ఆశలు ఉంటాయని, అందుకు తగ్గట్టుగా పని చేయాలనీ, ఏ ఒక్కర్ని నిరాశ పరచకుండా వైద్యులు చూడా లని అన్నారు. ఆసుపత్రులకు ఎలాంటి సహకారం కావాలన్నా తమ దృష్టికి తెస్తే సహకరిస్తామని అన్నారు. శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ ఛాంబర్లో ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు, అందిస్తున్న సేవల పై వైద్యాధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఓ.పి, శస్త్ర చికిత్సలు పెరగాలని, రిఫెరల్ కేసులు తగ్గాలని అన్నారు. సర్వజన ఆసుపత్రిలో సిటీ స్కాన్, ఎం.ఆర్.ఐ ఎక్విప్మెంట్ ప్రస్తుతం పని చేయడం లేదని తెలుస్తోందని అడిగారు. ఎన్ .ఆర్.ఐ హాస్పిటల్ తో పి పి మోడ్ లో ఈ ఎక్విప్మెంట్ ను ఏర్పాటు చేసిందని, రిపేర్ కోసం వారికీ తెలియజేసామని, త్వరలో మరమ్మతులు అవుతాయని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. పద్మలీల తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. డా.అశోక్ కుమార్, డి.ఎం.హెచ్.ఓ డా.రమణ కుమారి, డి.సి.హెచ్.ఎస్. డా.గౌరీ శంకర్, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారు : టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం పూర్తిగా భ్రష్టు పట్టిందని, వీరి పాలనలో ఏ ఒక్కరికైనా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున మండపడ్డారు. ఆ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరి పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్క పరిశ్రమను స్థాపించిన పాపాన పోలేదని, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే పెట్టుబడిదారులకు భరోసా లేకుండా పోయిందని ఆరోపించారు. రాష్ట్రం అన్ని రంగాలలోనూ వెనుకబడిపోయిందని, రాష్ట్ర ప్రజలు దిక్కుతోచని స్థితిలో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల పెట్టే రూపాయికి భరోసా లేకపోవడంతో రాష్ట్రంలో పరిశ్రమ స్థాపన జరగడంలేదని అన్నారు. ఈ నాలుగేళ్ల పాలనలో మచ్చు కైనా ఒక కొత్త పరిశ్రమ స్థాపించలేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. వైకాపా అరాచక పాలనను రాష్ట్ర ప్రజలకు గమనిస్తున్నారని, ఈ ప్రభుత్వానికి అంతిమ ఘడియలు దగ్గరకొచ్చాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు కంది మురళి నాయుడు, ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కొండ్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పెయిం టర్లు, తాపీ, కార్పెంటర్లు, ప్లబింగ్, ఎలక్ట్రీషియన్లు తదితర పనుల్లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. ఎస్.కోట తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేగల అప్పలరాజు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల పోరాటం ఫలితంగా సంక్షేమ బోర్డు ద్వారా పని చేస్తున్న కార్మికుల ను నమోదు చేసుకుని, వీరికి సంక్షేమ పథకాలు అందించే వారన్నారు. కానీ ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డుకు చెందిన రూ.1600కోట్ల నిధులను వాడుకుందన్నారు. బోర్డు ద్వారా పథకాలను అందజేయడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు చెందిన 32 వేల క్లయిమ్స్ పెండింగులో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.5వేల పింఛను, సుప్రీంకోర్టు తీర్పు ను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్న బోర్డు సొమ్ము రూ.1600కోట్లను వెంటనే జమ చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ పప్పు హరికి భవన నిర్మాణ కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు షేక్ స్వామి, భవన నిర్మాణ కార్మిక నేతలు బి.వెంకటరావు, నౌదాసరి శివ, పొలిమేర శ్రీను, వానపల్లి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో నీటి ఎద్దడి నివారణకు కృషి

విశాలాంధ్ర - జామి : మండలంలో రానున్న వేసవి కాలంలో ఎక్కడా ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకుం టున్నామని ఎంపిపి సబ్బవరపు అరుణ తెలిపారు. స్థానిక మండల పరిషత్కార్యాలయంలో క్రాష్ ప్రోగ్రాంను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ముందస్తుగా బోర్లు, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని ఆర్డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. జడ్పిటిసి గొర్లె సరయు మాట్లాడుతూ గ్రామాలలో వేసవి నేపథ్యంలో బోర్లును రిపేర్లు చేయాలని, రక్షిత పథకాలను ఆగకుండా తగిన ప్రణాళిక ప్రకారం క్రాష్ ప్రోగ్రాం చేయాలన్నారు. మొత్తం 45 రోజుల పాటు క్రాష్ ప్రోగ్రాం జరుగుతుందని, ఈకార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలను సందర్శించి తాగునీటి ఇబ్బందులను తొలగిస్తామని ఆర్ డబ్ల్యూఎస్ జెఇ రొంగలి ఝాన్సీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో ఎం. సతీష్, మండల వైసీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, ఇవోపిఆర్డి లక్ష్మి, నేతలు వాసు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో ' జగనన్నే మా భవిష్యత్ '

విశాలాంధ్ర - చీపురుపల్లి : జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమములో భాగంగా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సూచనల మేరకు విజయనగరం జిల్లా వై.యస్.ఆర్. పార్టీ అధ్యక్షులు శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) గారి పర్యవేక్షణలో శనివారం చీపురుపల్లి మండలంలో రామలింగపురం, అలజంగి సచివలయాల పరిధిలో కన్వీనర్లు మరియు గృహ సారథుల తో సమావేశం నిర్వహించి ప్రచారసామాగ్రి పంపిణీ చేసిన చీపురుపల్లి మండల సీనియర్ నాయకులు ఎంపీపీ ఇప్పిలి అనంతం, చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులు జడ్పీటీసీ వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దన్నాన జనార్దన, మండల కన్వీనర్ సువ్వాడ అప్పలనాయుడు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, గృహసారదులు స్థానిక సర్పంచ్ మరియు ఎంపీటీసీ ఇతర పార్టీ నాయకులతో కలిసి ఏప్రిల్ 7వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో ఇంటి ఇంటికి జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమంను ప్రతి ఇంటి వద్ద సుమారు 15 నుండి 20 నిమిషాలు పాటు గడపాలి, ప్రచార సందేశాన్ని వివరించి వారి మద్దతు కోరాలన్నారు.

యువత భవిష్యత్ నాశనం చేస్తున్న జగన్ రెడ్డి

మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - వేపాడ/ లక్కవరపుకోట : రాష్ట్రంలో యువత భవిష్యత్తును సీఎం వైఎస్ జగన్ నాశనం చేస్తున్నారని రంగవరపుకోట నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. శనివారం లక్కవరపుకోటలో కోళ్ళ లలిత కుమారి నివాసం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే 2.30 లక్షలు ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ అంటూ ప్రగబ్బాల పలికి నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. అదే విధంగా ప్రభుత్వం ఉద్యోగాలకు నోటిఫికేషన్ లేదా, రాష్ట్రానికి కొత్తగా పరిశ్ర మలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పల రాంప్రసాద్, వేపాడ టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రుపోటు రాము, ఉపాధ్యక్షులు గోకాడ మద్దాలు (అచ్చెంనాయుడు), జీ.నాగభూషణం, చల్లా వెంకటరావు, బొజంకి మహేశ్వరరావు, గుంటపల్లి దేముడునాయుడు, కోటాన అప్పలనాయుడు, పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - డెంకాడ : లెండిలో మెకానికల్ విభాగ యువజనోత్సవం (విధాత్రి) 2023 లో వైజాగ్ స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ ప్.పార్థ సారథి ఘోష్ మెకానికల్ విభాగ విద్యార్థి సంఘ యువజనోత్సవం విధాత్రి 2023 శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యింది. మెకానికల్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో 2023 యువజనోత్సవ సభలో ప్రిన్సిపాల్ డా.వి.వి. రామారెడ్డి మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీర్స్ ఎప్పటికప్పుడు సాంకేతికను అంది పుచ్చు కుంటే కెరీర్ అద్భుతంగా ఉంటుందని, మంచి ప్రవర్తన చిత్తశుద్ధితో సాధన చాలా ముఖ్యమని విద్యార్థులకు హితవు పలికారు.

పార్వతీపురం మన్యం

అంటరానితనం, వివక్ష వంటి సంఘటనలు జిల్లాలో జరగరాదు

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం మన్యం జిల్లా పరిదిలో అంటరానితనం, వివక్షవంటి సంఘటనలు జరిగితే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ , జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడులు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ అంటరానితనం, అత్యాచారం, దాడులకు గురయిన బాధితులకు సత్వరన్యాయం, పరిహారం అందించాలన్నారు. పరిహారం పెండింగుగల కేసుల వివరాలను తెలుసుకున్నారు. జిల్లావిజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ ఏర్పాటైన నాటి నుండి నమోదైన పదికేసుల ప్రస్తుత పరిస్థితిపై, కేసులవారీగా సమీక్ష నిర్వహించారు. కేసులనమోదులో జాప్యం ఉండకూడదని, కేసునమోదుకు అవసరమైన ధృవపత్రాలు వెంటనే భాదితులకు అందించాలని అధికారులను ఆదేశించారు. డివిజనల్ స్థాయి సమావేశాలు నిర్వహించి కేసులపై సమీక్ష నిర్వహించాలన్నారు.

7 నుంచి 'జగనన్నే మాభవిష్యత్తు'

విశాలాంధ్ర - సీతానగరం : ఏప్రిల్ 7నుండి జగనన్నే మా భవిష్యత్ ప్రచార కార్యక్రమంను ప్రారంభంచేసి 14నాటికి అన్ని గ్రామ సచివాలయంల పరిధిలోగల ప్రతీ గ్రామంలోను ప్రతీ ఇంటిని పూర్తి చేయాలని ఎమ్మెల్యే జోగారావు ఆదేశించారు. మండల కేంద్రంలోని వైసీపీ సీనియర్ నాయకులు ఆర్వీ ఇంటివద్ద ఎమ్మెల్యే అలజంగి జోగారావు అధ్యక్షతన సీనియర్ నాయకులు, సచివాలయంల కన్వీనర్లుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఆదేశానుసారం జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమం నిర్వహణ ప్రచార కార్యాచరణ పై చర్చించారు. ప్రతీ గ్రామంలోను ప్రతీ ఇంటిని దీని ద్వారా సందర్శన చేసేలా ప్రణాలికలు సిద్ధం చేయాలనీ కోరారు. దీంతో పాటు మండలంలోని మిగిలిన సచివాలయంలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కూడా పూర్తి చేయాలన్నారు.

ఇచ్చిన హామీల్లో 98.4% నెరవేర్చిన ఘనత వైసీపీది

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీ పురం నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం193వ రోజు పార్వతీపురం మండలం జమదాల గ్రామంలో వరుసగా 3వ రోజున ఎంతో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ప్రారం భమైన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగారావు గ్రామంలో గల ప్రతి గడప వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని ఇంత వరకు ప్రభుత్వం వారికి చేకూర్చిన లబ్ధిని, సంక్షేమ పథకాలను తెలియపరుస్తూ వారికి ఏమైనా సమస్యలు ఉంటే అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేరుగా మీ ఇంటికి వెళ్ళమని చెప్పి మీ యోగక్షేమాలను తెలుసుకోవడంతో పాటు మీకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ప్రకారం అందుతున్నది లేనిది తెలుసుకొని అర్హత ఉండి ఏమైనా పథకాలు అందకుంటే వాటిని అందిం చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కావున మన వైసిపి ప్రభుత్వంలో పేదరికంలో ఎవరూ ఉండకూడదనే గొప్ప సంకల్పంతో ప్రతి గృహన్ని, మహిళని కూడా లక్షాధి, కారిణిగా తీర్చిదిద్ది వారి కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచి, జీవన విధానాలను వృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సంక్షేమ పాలనను కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు ఎంపిపి, జడ్పిటిసి, సీనియర్ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, జెసిఎస్ కన్వీనర్, సచివాలయం కన్వీనర్లు, గృహసారథలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, పాల్గొన్నారు.

మాతా శిశు ఆరోగ్యమే ధ్యేయం

విశాలాంధ్ర - బెలగాం : మాతా శిశు ఆరోగ్యమే ధ్యే యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డా. టి. జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు ఆయన సీతానగరం మండలం కోట సీతా రాంపురం, చినభోగిల, పెదబోగిల గ్రామాలలో వైద్య సిబ్బంది నిర్వహించిన జనని సెషన్స్ కార్యక్రమాలను సందర్శించి మాతాశిశు సంరక్షణ కార్డులను, పిల్లల టీకాకార్డులను, గర్భిణీల సందర్శన తేదీలను, రక్త పరీక్షల గణాంకాలను పరిశీలించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉన్న గర్భిణీలను త్వరగా గుర్తించి రక్త హీనత నివారణ దిశగా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు, ఐరన్ సక్రోజ్ ఇంజక్షన్లు, పౌష్టికాహారం ద్వారా రక్తహీనతను నివారించ వచ్చన్నారు. ఈ సందర్భంగా ఆయన కొంత మంది గర్భిణీలకు వైద్య సిబ్బందిచే హిమోగ్లోబిన్ పరీక్షలను చేయించి గణాంకాలను పరిశీ లించారు. గణాంకాలకు అనుగుణంగా ఆరోగ్యస్థితిని కూడా పరిశీలించుకోవాలని సూచించారు.

పెదమరికి గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

సర్పంచ్ చెక్కుపై నియంత్రణ

విశాలాంధ్ర - పార్వతీపురం : పార్వతీపురం మండలంలోని పెదమరికి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎన్ చంద్రశేఖర్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం చేసినట్లు గ్రామానికి చెందిన బొండపల్లి జనార్ధన జిల్లా కలెక్టరుకు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టరు పార్వతీపురం మన్యంజిల్లా డివిజనల్ అభివృద్ధి అధికారిని విచారణచేసి నివేదిక సమర్పిం చమని మార్జినల్ ఉత్తర్వులు జారీ చేసియున్నారు. ఆయన ఇచ్చిన నివేదిక ప్రకారం పెదమరికి గ్రామ పంచాయితీ కార్యదర్శి ఎస్. చంద్ర శేఖర్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీచేసియున్నారు. పెదమరికి గ్రామ పంచాయతీ గ్రామస ర్పంచ్ హెచ్. గంగ చెక్కు జారీచేయు అధికారాల పై నియం త్రణలు కూడా విధించినట్లుగా జిల్లా కలెక్టరు ఈ ఉత్తర్వులలో పేర్కొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి

విశాలాంధ్ర - కొమరాడ : రాష్ట్రంలో ఉన్న మహిళల అభివృద్ధి దేంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసీపీ అని ఎమ్మెల్యే పాముల శ్రీవాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా మూడో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాముల పుష్ప శ్రీవాణికు స్థానిక ప్రజా ప్రతి నిధులు నాయకులు మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేజిపై ఏర్పాటు చేసిన జ్యోతి ప్రజ్వలన చేసి వెలిగించారు. ఈ సందర్భంగా పుష్పశ్రీవాణి మాట్లాడుతూ రాష్ట్రంలో పేద సామాన్య మధ్య తరగతి ప్రజలను అభివృద్ధి చేసే దిశగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రజలంతా రుణపడి ఉండా లని అన్నారు. నవరత్నాలు పథకాల్లో భాగంగా సంక్షేమ పథకాలు 90% పథకాలు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. మండలంలో 854, స్వయం సహాయక సంఘాలకు 9693 మంది సభ్యులకు రూ .4.30 కోట్లు వైస్సార్ ఆసరా మూడో విడత వచ్చిన నిధులను చెక్కిలి రూపంలో సభ్యులకు అందజేశారు. రాష్ట్రంలో ప్రజలు అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో కూడా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీ కిరణ్ కుమార్, ఎంపీపీ శెట్టి శ్యామల జడ్పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, ఎంపీడీవో ఎల్వి అప్పారావు, తహసిల్దార్ సిహెచ్ రాధాకృష్ణ, ఎంఈఓ జామి నారాయణ స్వామి, వైసిపి కన్వీనర్ ద్వార పురెడ్డి జనార్ధన, కొమరాడ పిఎసిఎస్ అధ్యక్షులు యం. సూరపు నాయుడు, నాయకులు సింహాచలం ఎంపిటిసిలు సర్పంచులు మహిళలు నాయకులు పాల్గొన్నారు.

మన్యంలో శాస్త్రీయ ఆలోచనలకు కృషి చేయాలి

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లాలో శాస్త్రీయ ఆలోచనలను విస్తృతం చేయటానికి జన విజ్ఞాన వేదిక కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి ఆకాంక్షించారు. ఈమేరకు పార్వతీ పురం గిరిజన సామాజిక భవనంలో శనివారం జరిగిన జన విజ్ఞాన వేదిక జిల్లా శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో మూఢ నమ్మకాలు, చేతబడి, సారాయి లాంటి వాటి వల్ల యువత, సమా జం నాశన మవుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సైన్స్ చదివిన మేధావులు సైతం మూఢనమ్మకాల వైపు ఆలో చనలు చేయడం ఆందోళన కలిగిస్తోందని వాపో యారు. సమాజ మార్పు కోసం జన విజ్ఞాన వేదికతో కలసి ముందుకు సాగుతానని తెలిపారు.

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా : డిప్యూటీ సీఎం రాజన్నదొర

విశాలాంధ్ర - సాలూరు రూరల్ : ఆసరా పథకంతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందని డిప్యూటీ సిఎం రాజన్నదొర అన్నారు.శనివారం మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వల.ఈశ్వరమ్మ అధ్యక్షతన పట్టణం లో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆసరా పథకం కింద మూడో విడత నగదు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డిప్యూటీ సిఎం రాజన్నదొర హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.సంక్షేమ పథకాల రూపంలో ప్రతీ గడపకు లబ్ధి చేకురుతుందన్నారు. మూడో విడత క్రింద పట్టణానికి సంబంధించి 874 స్వయం సహాయక సంఘాల్లోని 8939 మంది లబ్ధిదారులకు 5.05 కోట్ల రూపాయలు నేరుగా మహిళల ఖాతాల్లోకి జమ అవుతాయన్నారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. మహిళలంతా కలసి ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ వైస్ ఛైర్పర్సన్ జరజాపు దీప్తి,వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైకాపా సీనియర్ నాయకులు,అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జరజాపు.ఈశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ హనుమంతు. శంకర్రావు, మెప్మా సిబ్బంది, అధిక సంఖ్యలో మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలో ఐఎఫ్ఎస్ అభ్యర్థులు

విశాలాంధ్ర - పార్వతీపురం : 2022 ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) బ్యాచ్ కు చెందిన అభ్యర్థులు పూసపాటి సాహిత్య (విశాఖపట్నం), దుబ్బాడఎస్.వి.అశోక్ (కాకినాడ) మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, పోలీస్ సూపరింటెండెంట్ వి.విద్యాసాగర్ నాయుడులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం నాడు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐ.ఎఫ్.ఎస్) చెందిన వారిద్దరు అభ్యర్థులు క్షేత్రస్థాయి శిక్షణా కార్యక్రమంలో భాగంగా మన్యంజిల్లాలో పర్యటించడానికి విచ్చేశారు. పరిపాలనా పరమైన అంశాలను జిల్లా కలెక్టర్, పోలీస్ సూపరింటెండెంటులు వారికి వివరించారు. జిల్లాలో చేపడుతున్న వివిధఅభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజల జీవన విధానంను వివరించారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో పర్యటించారు. గుమ్మలక్ష్మీ పురం గోరంట స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తాము చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. ఇరిడిగ్రామంలో రైతుభరోసా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు కేంద్రం అందిస్తున్న వివరాలను సిబ్బంది తెలిపారు. కురుపాంలో గ్రామ సచివాలయంను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. కురుపాం ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, భోజన వసతులు గమనించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. వారితో పాటు టి.పి.ఎం.యు ఏపిడి వై.సత్యంనాయుడు సమన్వయ అధికారిగా పాల్గొన్నారు.

జగనన్న గృహనిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని జగనన్న లే అవుట్ లలో నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇళ్లను ప్రారంభం చేయకపోతే ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దుచేస్తామని ఎంపిడిఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన అప్పయ్యపేట గ్రామంలోని జగనన్న లే అవుట్ వద్దకు వెళ్ళి లబ్దిదారులతో మాట్లాడారు. త్వరితగతిన నిర్మాణాలు జరిగేల లబ్దిదారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ జానకీరాం, వర్క్ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎంపీటీసీ బురిడి సూర్యనారాయణ, ఈఓ వెంకటరావు, సెక్రటరీ సుధారాణి, ఇంజనీరింగు సహాయకులు సంతోష్ లబ్దిదారులు పాల్గొన్నారు.

కార్యదర్శులతో సమావేశం : ఎంపీడీఓగా భాధ్యతలు తీసుకున్న ప్రసాద్ వెంటనే పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.గ్రామాల్లో పారిశుధ్యం తొలగింపు, వీధి లైట్లు ఏర్పాటు, త్రాగు నీరుసౌకర్యం, ఇంటిపన్నులు వసూలు, హరితరాయబారుల వేతనాలచెల్లింపు, చెత్త సంపద కేంద్రాల పని తీరు, సచివాలయంలో సిబ్బంది హాజరు, వాలంటీర్ల పర్యవేక్షణ తదితర అంశాలను ఎంపీడీఓ చర్చించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సమతుల్య పౌష్టిక ఆహారాన్ని అందించాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్ : రాష్ట్రములో అన్ని అంగన్వాడీ కేంద్రాలలో బాలలకు, గర్భిణీలకు, బాలింతలకు పోషక పదార్థాలతో కూడిన సమతుల్య పౌష్టిక ఆహారాన్ని అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు తెలిపారు. శనివారం విజయనగరం పట్టణం దాసన్న పేటలో గల అంగన్వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడా కార్యకమములో భాగంగా కేసలి అప్పారావు, జిల్లా బాలల సంక్షేమ సమితి వారితో సందర్శించారు. విజయనగరం ఐసిడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న నవాబ్ పేట అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ ప్రసన్న ఆధ్వర్యంలో పోషన్ పక్వాడాలో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించి, బాల్య వివాహాలుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలింతలు గర్భిణీలు, పిల్లలు కోసం ఎంతో ఖర్చు పెట్టి పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తున్నందున ప్రతి ఒక్క లబ్ధిదారులు పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాలు జరగకుండా తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శాంత కుమారి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్న పోర్ట్ ఫైడ్ రైస్ ను లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని, రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. సిడిపిఓ ప్రసన్న మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు రక్తహీనత కు గురికాకుండా ఉండాలంటే ఆయా కాలాల్లో లభించిన కూరగాయలను పండ్లను తీసుకోవాలని తెలిపారు. అనంతరం రాగులు, జొన్నలు తదితర చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించి ఆరోగ్యవంతమైన పిల్లలకు వెల్ బేబీ షో నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ జి. హిమబిందు, సభ్యులు సుధారాణి పట్నాయక్, భవాని స్థానిక కార్పొరేటర్ గాదం మురళి, ఏసిడిపిఓ సత్యవతి, సభ్యులు బి.భవాని, పి.సుధారాణి, సూపర్వైజర్లు, ఎర్రయ్యమ్మ, మేరీ, అనురాధ, శారద అంగన్వాడి కార్యకర్తలు తల్లులు సఖి గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

సర్వపాడు మృతులకు సాయం చేయాలి

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం సర్వపాడు గ్రామంలో శుక్రవారం ఇంటి గోడ కూలి మృతి చెందిన మృతులు, గాయపడిన వారి కుటుంబాలకు ఆర్థికంగా సాయం చేయాలని కోరుతూ శనివారం జనసేన, సిపిఎం, టిడిపి తదితర పార్టీ నాయకులు జిల్లా ఆసుపత్రి, ఐటిడిఏ కార్యాలయాల వద్ద మృతదేహాలతో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు, చినఖేర్జల సర్పంచ్ హిమరిక గంగాధర్, వంగల దాలి నాయుడు, సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి, తెలుగుదేశం పార్టీ నాయకులు తోయక జగదీశ్వరి, శేఖర్ పాత్రుడు, గుల్లిపల్లి సుదర్శనరావు, దేవకోటి వెంకటనాయుడు, కోలక ధర్మారావు, బలరాం నాగేశ్వరరావు మరడాన తిరుపతినాయుడు, మరిశర్ల సింహాచలం, పడాల హరి ప్రసాద్, వప్పంగి రాఘవేంద్ర, బత్తిల శ్రీను, పాలక నూకరాజు, నందివాడ కృష్ణబాబు, చినఖేర్జల మాజీ సర్పంచ్ నందిగాన ప్రసాద్ తదితరులు జిల్లా ఆస్పత్రి వద్ద ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం పోస్ట్ మార్టం నిర్వహించిన మృతదేహాలను ఐటిడిఏ కార్యాలయం వద్దకు ర్యాలీగా తీసుకువెళ్లి మృతదేహాలతో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొమరాడ మండలంలో అంటివలస ఆటో ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు కూడా ప్రభుత్వం నయా పైసా కూడా చెల్లించలేదని, గిరిజనులు ప్రమాద బారిన పడి మృత్యువాత పడటంతో ఆయా కుటుంబాలు వీధిపాలవుతున్నాయన్నారు. సంబంధిత పాలకులకు, అధికారులకు ఇసుమంత కూడా పట్టడం లేదన్నారు. పాలకులు, అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో ఆయా కుటుంబాలు ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాయన్నారు. సర్వపాడు గ్రామంలో ఇంటి గోడ కూలి మృతి చెందిన శంకర్రావు, మాణిక్యమాల కుటుంబాలతో పాటు గాయపడిన వారి కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా వారు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు శరణ్ ను కలసి ఆయా కుటుంబాలకు ఆర్థికంగా సాయం చేయాలని కోరారు. దీనికి ఐటిడిఏ పివో నిధులు లేవంటూ తేల్చి చెప్పడంతో వారు వెనుతిరిగారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరడంతో చివరికి ప్రభుత్వాసుపత్రిలో ఉన్న అంబులెన్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటిడిఏ ఉన్నా గిరిజనులకు ఏమాత్రం ప్రయోజనం లేదని, గిరిజనులను ఆదుకోవటంలో ఐటిడిఏ విఫలమయిందని గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.

జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఏర్పాటు : ఎంపీపీ మీసాల

విశాలాంధ్ర -గరివిడి : జగనన్నే మా భవిషత్ కార్యక్రమంలో భాగంగా వై.యెస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సూచనల మేరకు విజయనగరం జిల్లా వై.యెస్.ఆర్. పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఈ రోజు గరివిడి మండలంలో మందిరవలస ,కాపు సెంభం.బొండపల్లి. దేవడా. ఏనుగువలస. చుక్కవలస సచివలయాల పరిధిలో కన్వీనర్లు మరియు గృహ సారధుల తో సమావేశం నిర్వహించి ప్రచారసామాగ్రి గరివిడి ఎంపీపీ మీసాల విశ్వేశ్వరావు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ మీసాల విశ్వేశ్వరావు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు , వాలంటిర్లు, గృహసారదులు స్థానిక సర్పంచ్ మరియు ఎంపీటీసీ ఇతర పార్టీ నాయకులతో కలిసి ఏప్రిల్ 7వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో ఇంటి ఇంటికి జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమంను ప్రతి ఇంటి వద్ద సుమారు 15 నుండి 20 నిమిషాలు పాటు గడపాలి, ప్రచార సందేశాన్ని వివరించి వారి మద్దతు కోరాలని అయన కోరారు.గత ప్రభుత్వం కంటే మన ప్రభుత్వ పాలనలో ప్రజలకు మరింత మంచి జరుగుతుంది అనే కరపత్రాన్ని చదివి, దానిని ఇంటి వారికి అందజేయాలనీ ఆయన తెలియచేసారు. మరియు ప్రజా మద్దతు పుస్తకాలలో ఉన్న ప్రశ్నలను ఇంటి వారిని అడిగి సమాధానాలను పూరించి ఆ ఇంట్లో వారికి రసీదు ఇవ్వాలన్నారు.అలాగే జగనన్న పాలనకు మద్దతు తెలిపేందుకు 8296082960 నంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని ఇంటి యజమానికి అభ్యర్థించాలనీ అయన వివరించారు.ఏప్రిల్ 7 వ తేదీ నుండి జరిగే సచివాలయ కన్వీనర్లు , వాలంటీర్లు మరియు గృహ సారథులు ద్వారా డోర్ టు డోర్ ప్రచారాన్ని మండల ఇంఛార్జ్ లు అయిన మేము పర్యవేక్షిస్తామన్నారు.మరియు జగనన్న కు మద్దతు తెలిపే ప్రతి కుటుంబం 8296082960 నంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చే విధంగా గృహ సారథులు చేసుకోవాలని అయన సూచించారు. మండలం జే సి ఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్ మాట్లాడుతూ.. గృహ సారథులు ప్రతి ఇంటిని సందర్శించిన తర్వాత ప్రజా మద్దతు పుస్తకాలలో వున్నా రెండు రసీదుల్లో ఒకటి ఇంటి యజమాయనికి ఇవ్వగా మిగిలిన రసీదులు భద్రపరిచి వాటిని మండల ఇంఛార్జ్ లు అయిన మాకు అందజేయ్యాలని అయన వివరించారు. మరియు సచివాలయ కన్వీనర్లు మరియు గృహ సారథులు సందర్శించిన ఇళ్లపై మాకు రోజువారి నివేదిక అందజేయ్యాలని అయన సూచించారు.అలాగే ప్రతి గృహ సారధి వారికి కేటాయించిన క్లస్టర్లలో ప్రతి రోజు 10 - 15 గృహాలను సందర్శించాలని అయన అన్నారు.ప్రేతి ఇంటికి మీరు వెళ్ళేటప్పుడు వారి అనుమతితోనే స్టిక్కర్లు అంటించాలని అంతే కానీ ఎందుకు అంటించకూడదు అని ఘర్షణలు పడొద్దు అని అయన కోరారు.ఈ కార్యక్రమంలో గరివిడి మండల ఎంపీపీ మీసాల విశ్వేశ్వరావు తొ పాటుగా వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములు నాయుడు.అత్తుర్ గ్రామ సర్పంచ్ మరియు మండలం జే సి ఎస్ కన్వీనర్ పొన్నాడ కుమార్.దేవడా సర్పంచ్ అప్పలనాయుడు. సర్పంచ్లు. ఎంపీటీసీలు.సచివాలయ కన్వీనర్లు , గృహ సారథులు ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వేంద్రియానం నయనం ప్రధానం..
కళ్ళు లేని జీవితం సర్వం చీకటిమయం

విశాలాంధ్ర - గరివిడి : మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, గరివిడి లైన్స్ కంటి ఆసుపత్రి వారితో గరివిడి మండలం కుమరామ్ గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంకు 46 మంది రాగా 23 మంది ఆపరేషన్లకు తీసుకు వెళ్లడం జరిగినది.ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరముకు, గ్రామ సర్పంచ్ ముల్లు రమణ, జంపన రవి, గ్రామ పెద్దలు మరియు బివి గోవిందరాజులు మానవిత అధ్యక్షులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌పై దాడిని ఖండిస్తున్నాం

విశాలాంధ్ర - బొబ్బిలి : బిజెపి జాతీయ కార్యదర్శి సత్య కుమార్ కారుపై మూడు రాజధానుల వైసిపి నాయకులు రాళ్లతో దాడి చేయడం వైసిపి ప్రభుత్వ నాయకుల దుర్మార్గ చర్యలని ప్రజలు ప్రజా సంఘాలు సత్య కుమార్ పై దాడిని ఖండించాలని బిజెపి నాయకులు మరిశర్ల రామారావు నాయుడు, బిజెపి జిల్లా కార్యదర్శి పెద్దింటి మనోజ్ కుమార్‌లు ఖండించారు. మందడంలోని రాజధాని రైతుల కార్యక్రమంలో పాల్గొని తిరిగి ప్రయాణంలో విజయవాడ వెళుతుండగా మూడు రాజధానుల మద్దతుదారులు తాళాయపాలెం జంక్షన్ వద్ద ఆయన వాహనంపై దాడి చేసి ఆయనపై దాడికి పాల్పడ్డారని దుర్మార్గమన్నారు. అమరావతి రాజధాని రైతులు చేస్తున్న ఉద్యమం 1200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజధాని రైతులకు సంఘీభావం తెలిపిన బిజెపి రాష్ట్ర నాయకులు సత్య కుమార్ పై వైసీపీ నాయకులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఎవరి అభిప్రాయాలు వారు చెప్పుకోవచ్చు అని వారి అభిప్రాయం నచ్చకపోతే దాడులు చేయడం సరికాదని అన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో మహిళలకే సర్వహక్కులు

విశాలాంధ్ర - నెల్లిమర్ల : వైసీపీ ప్రభుత్వంలో మహిళలకే సర్వ హక్కులు ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి కల్పించారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు అన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీలో డ్రాక్రా సంఘాలకు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తో కలిసి శనివారం ఆసరా చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల పేరిటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి, ఆసరా, విద్యాదీవెన, విద్యావసతి, చేయూత తదితర పథకాలు మహిళల పేరిటే అందిస్తున్నారని చెప్పారు. రాజకీయ పదవుల్లో కూడా మహిళలకు ప్రాధాన్యత కల్పించారని చెప్పారు. నగరపంచాయతీలో డ్రాక్రా సంఘాలకు రూ.2.49 కోట్లు ఆసరా ద్వారా మహిళల ఎకౌంట్లకు జమచేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజిని, వైసిపి కన్వీనర్ చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, మెప్మా పీడీ సుధాకరరావు, కమిషనర్ పి బాలాజీ ప్రసాద్, తహశీల్దార్ రమణరాజు, కౌన్సిలర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, మెప్మా సిఎంఎం గోవింద్ పాల్గొన్నారు.

4న జామిలో ఆసరా ఉత్సవాలు

విశాలాంధ్ర - జామి : రాష్ట్ర ప్రభుత్వం అన్ని మండలాలలో చేపడుతున్న ఆసరా ఉత్సవాలలో భాగంగా ఈనెల 4వి తేదీన జామి మండలంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నామని మండల ఐకెపి ఎపిఎం మధుమహేష్ తెలిపారు. మండల కేంద్రమైన జామిలోని శ్రీఎల్లారమ్మ ఆలయ ఆవరణలో ఆసరా ఉత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

5న బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - విజయనగరం : దేశ మాజీ ఉప ప్రధాని డా.బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ సూర్యకుమారి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఉదయం 10-30 గంటలకు ప్రభుత్వ ఉత్సవంగా ఈ వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని డా. జగజ్జీవన్ రామ్ కు నివాళులు అర్పిస్తారని తెలిపారు.

11న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 11వ తేదీ ఉదయం 10-30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో చైర్మన్ శ్రీ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతుందని సిఇఓ డా.ఎం.అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

విశాలాంధ్ర - బెలగాం : ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం నాలుగు రోడ్ల కూడలి వద్ద పట్టణ కార్మిక సంఘ నాయకులు బంకురు సూరిబాబు, గుడుపూరు కృష్ణతో కలసి గోడపత్రికలు విడుదల చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కనీస పెన్షన్ పదివేల రూపాయలు ఇవ్వాలని, నాలుగు లేబరు కోడ్ లు రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, టైం స్కేల్, స్కీం వర్కర్స్, డైలీ వేజ్, కంటెంట్ ఉద్యోగులను, కార్మికులను రెగ్యులైజేషన్ చేయాలని, 2022 విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని, కేరళ ప్రభుత్వం వలే నిత్యవసర సరుకులు 14 రకాల దినుసులు రేషన్ డిపోల ద్వారా ఇవ్వాలన్నారు.

60.38 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలో శంకుస్థాపన వారోత్సవాలలో భాగంగా శనివారం 60.38 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. 38వ డివిజన్‌లోని బొబ్బాది పేట, 40వ డివిజన్లలో రహదారులు, కాలువలు, 41వ డివిజన్లో సామాజిక భవన నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఆయన రాకను పురస్కరించుకుని స్థానికులు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు పూల వర్షాన్ని కురిపించారు. ఈ సందర్భంగా 40,41 డివిజన్ల కార్పొరేటర్లు బి. ధనలక్ష్మి, సుంకర నారాయణ స్వామి మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ లేనివిధంగా అన్ని ప్రాంతాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభివృద్ధిని చేసి చూపిస్తున్నారని అన్నారు. శంకుస్థాపన వారోత్సవాలలో భాగంగా నాలుగవ రోజున తమ డివిజన్లో రోడ్లు,కాలువలు, నిర్మాణానికి రహదారుల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం సంతోషదాయకమన్నారు. 41వ డివిజన్లో ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరిన సామాజిక భవన నిర్మాణానికి మోక్షం లభించినట్లు అయిందని అన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తూ సంక్షేమాన్ని అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. మరోసారి ఆయనను శాసనసభ్యులుగా గెలిపించి ప్రజలు రుణం తీర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, 38వ డివిజన్ కార్పొరేటర్ తొగురోతు సంధ్య సంధ్యారాణి, జోనల్ ఇన్చార్జిలు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, వైసిపి నాయకులు నారాయణప్పడు, నగరపాలక సంస్థ ఈఈ కే. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపిన పంచాయతీ కార్యదర్శులు

విశాలాంధ్ర - సీతానగరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎంపిడిఓగా భాధ్యతలు చేపట్టిన ఎంఎల్ఎన్ ప్రసాద్ ను మండలంలోని 35గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారంనాడు కలసి పుష్ప గుచ్ఛెంలు అందజేసి అభినందనలు తెలిపారు. ఎంపిడిఓకు అన్ని విధాల సహకారాన్ని అందించి,గ్రామాల్లో ఆయన సూచనలు మేరకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా ఎంపిపిగా జాయిన్ అయిన ప్రసాద్ మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే జోగారావును, పలువురు ప్రజా ప్రతినిదులను, అధికారులని కలిశారు. ప్రసాద్ ను మండలంలోని వివిధ శాఖల అధికారులు,సర్పంచులు, ఎంపిటిసిలు,నాయకులు కలసి అభినందనలు తెలిపారు. ఆయనను 21గ్రామ సచివాలయాలకు చెందిన డిజిటల్, వెల్ఫేర్, ఇంజినీరింగ్, ఎంఎస్పీలు తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామికి వెండి పళ్ళెం సమర్పణ

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రములోని సువర్ణముఖి నదీతీరాన వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోగల శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంకు సీతానగరంకు చెందిన కూర్మదాసు శ్రీనివాసరావు దంపతులు శనివారం నాడు అర్థకిలో వెండితో తయారు చేసిన వెండి పళ్ళెంను కానుకగా ఇచ్చారు. ఆలయ అర్చకులు శ్రీనివాసా చార్యులకు అందజేసి, స్వామి వారిని పూజించుకున్నారు. సీతానగరంలో బొబ్బిలి రాజుల ఆలయంగా పేర్గాంచిన శ్రీ వేణుగోపాల స్వామిదేవాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంవల్ల మరింత ఖ్యాతి గడించడం గమనార్హం. ప్రతీ గురువారం రెండు జిల్లాలతోపాటు ఇతర ప్రాంతాలనుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు కృషి యెనలేనదని భక్తులు చెప్పడం గమనార్హం.

బీజేపీ జాతీయ కార్యదర్శిపై దాడి అమానుషం : శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పార్వతీపురం : అమరావతిలో శుక్రవారం నాడు బీజేపీ జాతీయ కార్యదర్శి పై వైసీపీ నాయకులు ప్రణాళిక బద్ధంగా జరిపిన దారుణ దాడిని ఖండిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీను ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజా స్వామ్యంలో ఇటువంటి దాడులు జరగడం అత్యంత హేయనీయమని, అధికార పక్షానికి చెందిన నేతలు దీని వెనుకఉండి జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌పై దాడి అమానుషమన్నారు. తక్షణమే దాడికి పాల్పడిన వైఎస్సార్సీపీ నాయకులను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సంగీతానికి పుట్టినిల్లు విజయనగరం : మాధవపెద్ది సురేష్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విజయనగరం సంగీతానికి పుట్టినిల్లు అని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లాలో పర్యటించిన నేపథ్యంలో ఆయనను ఘంటసాల సంగీత సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు నముద్రాల గురుప్రసాద్ ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా మాధవపెద్ది మాట్లాడుతూ విజయనగరంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, వాజీ ఛానల్ నిర్వహించిన పాటలపల్లకీలో కార్యక్రమంలో పాల్గొన్నానని, బిఏ నారాయణ, ధనంజయ్ వంటివారిని వెండితెరకు పరిచయం చేసానని అన్నారు. సంగీతం సార్వజనీనమైనదని, ట్యూన్‌కు పాట ఇవ్వడం కంటే, రాసిన పాటకు ట్యూన్ చేయడాన్ని ఇష్టపడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ యూత్ సర్వీసెస్ డైరక్టర్ కెఆర్‌కె.రాజు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న తెదేపా నాయకులు

విశాలాంధ్ర - గంట్యాడ : గంట్యాడ మండలం నరవ గ్రామంలో సుంకరి రాము నాయుడు మరియు గ్రామస్తులు ఆధ్వర్యంలో జరుగుతున్న బంగారమ్మ తల్లి భద్రమ్మ తల్లి పండుగ సందర్భంగా అమ్మవారిని దర్శనం చేసుకున్న తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు కొండపల్లి భాస్కర్ నాయుడు మండల పార్టీ ఉపాధ్యక్షులు గొర్రుపాటి శ్రీనివాసరావు యువత అధ్యక్షులు పెద్దిరెడ్డి సత్య నారాయణ గ్రామ పెద్దలు పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచులు రామనాయుడు త్రినాథ్ మాజీ ఎంపీటీసీ పైడి రాజు పార్టీ సీనియర్ నాయకులు ఎస్,త్రినాథ్ కే.చిన్నమనాయుడు తదితరులుపాల్గొన్నారు.

ఫుడ్ బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - విజయనగరంటౌన్ : నగరంలో అన్నార్తులకు ఆకలి బాధలు తీర్చేందుకు ఫుడ్ బ్యాంకులు ఎంతగానో ఉపయోగంగా ఉంటున్నాయని వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కనకల కృష్ణ అన్నారు. శనివారం సోషల్ మీడియా ప్రతినిధి నవీన్ స్వయంగా అందించిన ఆహారాన్ని కోట వద్ద ఉన్న ఫుడ్ బ్యాంక్ ద్వారా పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ, నవీన్ మాట్లా డుతూ నగరానికి వచ్చిన సుదూర ప్రాంతాల వారికి మరియు పేదవారికి ఆకలి బాధలు తీర్చేందుకు ఐదు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల స్వామి వీరభద్ర స్వామి ప్రత్యేక చొరవతో ఐదు ప్రాంతాలలో ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేసి స్వచ్ఛంద సంస్థల ద్వారా పేదలకు ఆహార సౌకర్యాన్ని కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ స్పందించి శుభకార్యాలలో, శుభదినాలలో ఫుడ్ బ్యాంకులకు ఆహారాన్ని అందించి అన్నదాతలుగా మారాలని కోరారు.

చలో ఢిల్లీ వెళ్తున్న రైతులకు సంఘీభావం తెలిపిన ప్రజా సంఘాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఈనెల 5న పార్లమెంట్ వద్ద జరుగు చలో ఢిల్లీ కార్యక్రమానికి జిల్లా నుండి వెళుతున్న రైతులకు సిఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కే సురేష్, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకర్రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, ఎం.శ్రీనివాస సంఘీ భావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా, వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆరోపించారు. ఢిల్లీలో రైతులు కార్పొరేటు అనుకూల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసినప్పుడు చట్టాలను రద్దు చేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చి తీరా సంవత్సరం గడిచిన చట్టాలను రద్దు చేయలేదన్నారు. రైతులు పంటకు గిట్టుబాటు ధరలు చట్టం చేయలేదని రైతులు వినియోగించే విద్యుత్తుకు పంపులకు మీటర్లు బిగించి విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థలన్నీ ప్రైవేట్ వ్యక్తులు చేతుల్లో పెడుతుందని అన్నారు మోడీ 8 ఏళ్ల పరిపాలనలో కార్పొరేట్ సేవ తప్ప ప్రజలకు ఏమాత్రం మంచి పని చేయలేదని ఎద్దేవ చేశారు .కావున ఈ కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న దేశ రాజధాని ఢిల్లీలో జరుగు కార్యక్రమానికి జిల్లా నుండి వెళుతున్న రైతులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాత బగ్గాములో కాలువల నిర్మాణం

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలోని పాతబగ్గం గ్రామంలో ప్రధాన రహదారి లో ఇరువైపులా కాలవనిర్మాణ పనులను శనివారం గ్రామ సర్పంచ్ లంక పద్మావతి ప్రారంభించారు గతంలో ప్రధాన రహదారి లెవెల్ చేయడం జరిగిందన్నారు కాలువల నిర్మాణం చేపట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయని చెప్పారు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు లంక చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కిషోర్ బాలికల భవిష్యత్తు కోసమే సఖి గ్రూపులు : ఎంపీపీ ఉమాలక్ష్మి

విశాలాంధ్ర - తెర్లాం : కిషోర్ బాలికల భవిష్యత్ కోసమే ప్రభుత్వము సఖి గ్రూపులో ఏర్పాటు చేసిందని ఎంపీపీ నర్సిపల్లి ఉమాలక్ష్మి తెలిపారు. శనివారం స్థానిక వెలుగు సమాఖ్య భవనంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిషోర్ బాలికలు భవిష్యత్ కోసం విద్యా వంతులుగాను, ఆరోగ్యవంతులుగాను తీర్చిదిద్దడానికి స్వశక్తితో ఎదగడానికి స్వావ లంబన సాధించడానికి అవసరమైన అవకాశాలను అందించడమే సఖి గ్రూపు ముఖ్య ఉద్దేశమని ఆమె తెలిపారు. ఎంపీడీవో ఎస్ రామకృష్ణ మాట్లాడుతూ9 నుండి19 ఏళ్ల వయస్సు మధ్యనున్న బాలికలను గుర్తించి ప్రతి గ్రామంలో కనీసం ఒక గ్రూపును ఏర్పాటు చేయాలని, ఈ గ్రూపును ముందుండి నడిపించడానికి మహిళా పోలీసు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త, అంగన్వాడీ కార్యకర్త, ఎన్.వై.కె ప్రతినిధులు, ముఖ్యంగా ఉపాధ్యాయురాలు నిర్వాహకులుగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. సఖి గ్రూపుల ద్వారా అనేక వృత్తి నైపుణ్య కోర్సులలో ఓన్లీ విధాలుగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి రాజ్యలక్ష్మి, వైద్య అధికారి దీక్షితా రాణి, ఎంఈఓ త్రినాధరావు పాల్గొన్నారు.

ధర్మాన ప్రసాదరావును కలిసిన టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

విశాలాంధ్ర - బెలగాం : రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి వర్యులు ధర్మాన ప్రసాదరావును శనివారం మర్యాద పూర్వకంగా కలసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించగా మంత్రివర్యులు ఛైర్మన్ ప్రసన్న కుమార్‌ను ఆత్మీయంగా పలకరిస్తూ అభినందించారు. ఎపి టిడ్కో హౌసింగ్ లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హౌసింగ్ డే కార్యక్రమం అమలుపై, ఈ నెల మూడవ వారంలో టిడ్కో ఇళ్ళు ప్రారంభోత్సవం చేసేందుకు ముందస్తు కార్యాచరణలో భాగంగా శ్రీకాకుళం జిల్లా పాత్రునివలసలో టిడ్కో గృహ సముదాయలను కాంట్రాక్టింగ్ ఏజెన్సీ తో ఇంజనీరింగ్ అధికారులతో కలసి నాగావళి నదిలో జరుగుతున్న మంచి నీటి సరఫరా తుది దశ పనులు, ఎస్టిపి ట్రయిల్ రన్ పరిశీలనా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పాత్రునివలస వద్ద నిర్మాణం జరుగుతున్నటువంటి 1280 టిడ్కో ఇళ్లకు సంబందించిన (హౌసింగ్ %డ% ఇన్ ఫ్రాస్ట్రక్చర్) యొక్క పనుల పురోగతిని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ (వి.ఎన్.సి %డ% శింఘున్) సిబ్బందితో కలసి పర్యటించి తదుపరి వారితో సంయుక్తంగా చర్చించడంతో పాటుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్దిష్ట కాలవ్యవధి లోపల ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులకు, ఏజెన్సీ సిబ్బందికి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో గత మూడు నెలల్లో విజయనగరం, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, ఉమ్మడి నెల్లూరు, కర్నూలు జిల్లాలలో ఇప్పటికే ఏభై వేల గృహాలు అందించడం జరిగిందని, ఈ ఏప్రియల్ నుండి జూన్ 2023 వరకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా లక్షా యాభై వేల ఇళ్లను లబ్ధిదారులకు అందించే కార్యక్రమంలో భాగంగా చేయవలసిన హౌసింగ్ మురుగు నీటి శుద్ధి (ఎస్.టి.పి) ఇన్ ఫ్రాస్ట్రక్చర్ (రోడ్లు, మంచినీటి, డ్రైనేజీ, ఎలక్ట్రికల్) పనులు పూర్తి చేసి అన్ని సదుపాయాలతో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పాత్రునివలసలో నిర్మాణంలో ఉన్నటువంటి 1280 గృహ సముదాయాలను మునిసిపల్ అధికారులు ఇంజనీరింగ్ అధికారులతో, మెప్మా అధికారులతో కలసి జరుగు తున్న నిర్మాణ పనులను పరిశీలించి ఇంకనూ చేయవలసి ఉన్నటువంటి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ఈ ఏప్రియల్ మూడవ వారం నాటికి లబ్ధిదారులకు అందించాలని కాంట్రాక్టింగ్ ఏజెన్సీ అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులకు రుణాల మంజూరు కల్పించే విషయంలో మెప్మా డిపార్ట్మెంట్ అధికారులు, టిడ్కో అధికారులు కలిసి సమన్వయంతో సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ సిహెచ్ ఓబులేసు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్, టిడ్కో సూపరెంటెండెంటింగ్ ఇంజనీర్ డి.నరసింహ మూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సహోద్యోగులు, సిఎల్టిసి సభ్యులు, కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శోభారాణి పదవీ విరమణ

విశాలాంధ్ర - బొబ్బిలి : కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో అనస్థీషియా డాక్టర్ గా సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ కేకేవి శోభారాణి కి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ గేదెల శశిభూషణరావు అధ్యక్షతన స్థానిక వెలమవారి కల్యాణ మండపంలో పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మాజీమంత్రి డాక్టర్ పెద్దింటి జగన్మోహన్రావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు హాజరయ్యారు. విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యులు రిటైర్డ్ డిఎంహెచ్ఓ డాక్టర్ బొత్స కాశీనాయుడులు తోపాటు డాక్టర్ శోభారాణి కుటుంబ సభ్యుల శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దింటి జగన్మోహన్ రావు మాట్లాడుతూ, డాక్టర్ శోభారాణి స్వయానా తమ కుటుంబ సభ్యురాలని, తను చదువుకున్నప్పటినుంచి ఇప్పటి వరకు ఎంతో క్రమశిక్షణగా పనిచేస్తూ ఎంతో మంచి పేరు తెచ్చుకుంది అన్నారు. రిటైర్మెంట్ తర్వాత కూడా వైద్య సేవలో కొనసాగుతూ, ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పల నాయుడు మాట్లాడుతూ, వైద్యుల విజ్ఞప్తి మేరకు డాక్టర్ శోభారాణిని కాంట్రాక్ట్ బేసిస్ పై కొనసాగించడానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలియజేశారు. వైద్య వృత్తికి రిటైర్మెంట్ లేదని కనుక, జీవితాంతం వైద్య సేవలు అందించి మరింత మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ శోభారాణి దంపతులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ముందు కొంతమంది డాక్టర్లు మరియు కుటుంబ సభ్యులు శోభరాణి సేవలు గురించి కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే శంబంగి, మాజీ మంత్రి పెద్దింటి, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ తదితరులు డాక్టర్ కేకేవి శోభారాణి, డాక్టర్ గొట్టాపు బలరామి నాయుడు దంపతులను దుస్సాలువాతో సత్కరించి, పూల బొకేలతో అభి నందించారు. అనంతరం సభకు హాజరైన డాక్టర్లు మరియు కుటుంబ సభ్యులు మరియు శ్రేయోభిలాషులు శోభారాణి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ ద్వారపు రెడ్డి రామ్మోహన్రావు, డాక్టర్ శేషగిరి, డాక్టర్ రామ్ నరేష్, డాక్టర్ వై విజయ్ మోహన్ రావు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, గొట్టాపు కృష్ణమూర్తి నాయుడు, కర్రి సత్య నారాయణ పాల్గొన్నారు.

వై.యస్.ఆర్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - భామిని : మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి - మహిళల ఆర్థిక పరిపుష్టికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వై.యస్.ఆర్ ఆసరా మూడవ విడత చెక్కులు పంపిణీ కార్యక్రమం శనివారం స్థానిక వై .కె.పి ఏ.పి.ఎం భవానీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు విశ్వాసరాయి. కళావతి చేతుల మీదుగా వై.యస్.ఆర్ ఆసరా సంక్షేమ పథకం యొక్క మూడవ విడత చెక్ పంపిణీచేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వున్న 78.94 లక్షల పొదుపు సంఘాల మహిళా అక్క - చెల్లెమ్మలుకు రూ.6,419 కోట్లు రూపాయలు అందజేయడం జరుగుతుందని, వై.యస్.ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు మూడు విడతల్లో పొదుపు సంఘాల మహిళా అక్క - చెల్లెమ్మలుకు అందించిన మొత్తం సాయం రూ.19,178 కోట్లు రూపాయలు అన్నారు.. అలాగే భామిని మండలంలో 702 స్వయం సహాయక సంఘాలలో ఉన్న 7,624 మంది పొదుపు సంఘాల మహిళలకు గానూ మూడవ విడతగా రూ.3.72 కోట్ల రూపాయలు వై.యస్.ఆర్ ఆసరా సంక్షేమ పథకం ద్వారా డ్వాక్రా మహిళా అక్క - చెల్లెమ్మలుకు జగనన్న అందించడం జరిగిందని, తద్వారా మొత్తం మూడు విడతలుగా కలిపి రూ.11.34 కోట్ల రూపాయలు భామిని మండలంకు చెందిన పొదుపు సంఘాల మహిళా అక్క - చెల్లెమ్మలుకు మన జగనన్న ప్రభుత్వం అందించడం జరిగిందని ఆమె అన్నారు. అలాగే ఇప్పటి వరకు మహిళల ఆర్థిక భరోసా కొరకు, దేశంలో ఏ ప్రభుత్వం 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టలేదని, అలాగే ఇంత పెద్ద మొత్తం లో మహిళలకు ఆర్థిక చేయూత నిచ్చిన దేశం లో ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమని మహిళలు గ్రహించి, మరల జగనన్నను గెలిపించాలని మహిళల ను కోరారు. అలాగే 4వ విడత ఆసరా ను, వచ్చే ఏడాది జనవరిలో ఇస్తుందని మహిళలకు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భామిని మండల వైయస్సార్సీపీ పార్టీ కన్వీనర్ తోట.సింహాచలం, ఎంపిపి తోట.శాంతికుమారి, తహశీల్దార్ ఎన్ అప్పారావు, డి.పి.ఎం బి నారాయణరావు, ఎం.పి.టి.సి బి తులసి, ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు నిమ్మల నీలమ్మ జడ్పీటీసీ బొడ్డేపల్లి.చిన్నమ్మి, వైస్ ఎంపిపి టింగ.అన్నాజీ, జె.సీ.యస్ మండల కన్వీనర్ కొత్తకోట.చంద్రశేఖర్, కాపు డైరెక్టర్ మేడిబోయిన.చలపతిరావు, మాజీ జడ్పీటీసీ సోమరాజు.గోపాలరావు, పి.ఏ.సీ.ఎస్ చైర్మన్ గెల్లంకి.రమేష్, మండల పొదుపు సంఘాల మహిళా అక్క - చెల్లెమ్మలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఐదవ పంచమ వార్షిక బ్రహ్మోత్సవములు

విశాలాంధ్ర: దత్తిరాజేరు : దత్తి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ఈనెల 7వ తేదీన అనగా శుక్రవారం పంచమ వార్షిక బ్రహ్మోత్సవములు సందర్భంగా అర్చకులు శ్రీమత్ కందాడ హరికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు 108 కలశాలతో స్వామివారికి పంచామృతాభిషేకం అనంతరం పూజలు, హెూమాలు, శాంతి కల్యాణం , అన్న సమారాధన, గ్రామ తిరువీధి జరుగును అదే విధంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పెంకు తిరుపతి లక్ష్మీ దంపతులు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుండి మహా అన్నదాన కార్యక్రమం జరుగును. కావున చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించవలసిందిగా అని కోరారు.

కార్మిక,హక్కుల రక్షణకై ఈనెల 5న చలో పార్లమెంట్

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా జగన్ పిలుపు.

విశాలాంధ్ర - వేపాడ : కార్మిక, కర్షక హక్కుల రక్షణ కోసం ఈనెల 5న ప్రజా సంఘాలు చేపట్టిన మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా జగన్ పిలుపునిచ్చారు.సి. ఐ.టి.యు ఆధ్వర్యంలో సోంపురం క్వారీ కూడలి వద్ద జరిగిన ప్రచారకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా,రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారన్నారు.ఈ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులు కాలరాస్తున్నారన్నారు. రైతుల ఆత్మ హత్యలు దేశ వ్యాప్తంగా పెరిగాయన్నారు. దేశ సంపదను అధాని,అంబానీలు కట్టబెట్టి దోపిడీ చేస్తున్నారన్నారు.కనీస వేతనాలు అమలు చేయకుండా దేశంలో వ్యవసాయ రంగాన్ని,దేశీయ పరిశ్రమలను పెట్టుబడి దార్లుకు కట్టబెట్టి లూటీ చేస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ..26వేలు, కనీస పెన్షన్ రూ..10వేలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని ఈ సదస్సు ద్వారా డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలని, ఎరువుల సబ్సిడీని పెంచాలని సదస్సు ద్వారా డిమాండ్ చేశారు.ఉపాధిహామీ చట్టానికి బడ్జెట్ లో రూ. 2లక్షల కోట్లకు పెంచాలని,పట్టణాలకు విస్తరింప చేయాలని, కుటుంబానికి 200 రోజులు పని రూ.6 వందలు వేతనం ఇవ్వాలని,కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి భరోసా, పరిహారాలు ఇవ్వాలన్నారు. నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ప్రజాపంపిణీకి రూ.3లక్షల కోట్లు కేటాయించి 14 రకాల సరుకులు సబ్సిడీ ధరలతో అందించాలని,ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కార్మిక,రైతు,వ్యవసాయ,కౌలు రైతు సంఘాలు చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యనమల రమణ,సతీష్,వెంకటరమణ, శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర - పాలకొండ : మెయిన్ రోడ్డులో స్థానిక ఎస్ఐ బి. శివప్రసాద్ ఆద్వర్యంలో శనివారం పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల వద్ద సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తప్పవని అన్నారు. ధృవపత్రాలు లేని వాహనదారుల వద్ద అపరాధ రుసుం వసూలు చేశారు.

మే నెలలో సమ్మర్ కోచింగ్ క్యాంపు

విశాలాంధ్ర - పాలకొండ : నియోజకవర్గంలో మే నెల ఒకటో తేదీ నుండి అదే నెల 31 వ తేదీ వరకు నిర్వహించబడు సమ్మర్ కోచింగ్ క్యాంపునకు ఆసక్తి కలిగిన వ్యాయామ ఉపాధ్యాయ మిత్రులు, సీనియర్ క్రీడాకారులు ఆసక్తి కలిగిన వారు ఎవరైనా మీ పేర్లను పాలకొండ నియోజకవర్గ ఇన్చార్జి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దకాపు వీధిలో పీడీ పనిచేస్తున్న వి పుష్పనాథం ని 99086890 50 నెంబర్ సెల్ ఫోన్ నెంబర్లుకు సంప్రదించవలసిందిగా కోరుచున్నామని, మీ వివరములను మన్యం జిల్లా ప్రాధికార సంస్థ అధికారి వారికి పంపించడం జరుగుతుంది ఈ శిక్షణ కార్యక్రమంలో 8 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల లోపు బాల, బాలికల కోసం ఈ శిక్షణ నిర్వహించబడుతుందని పీఈటీ పుష్పనాథం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

పాప పరిహారానికై శిలువ యాత్ర

విశాలాంధ్ర - భామిని : పాప పరిహారానికై శిలువ యాత్రని ఫాదర్ చార్లెష్, ఫాదర్ రాజు, బ్రదర్స్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సోదర దీక్షపరులు, ఆంటోని ఆధ్వర్యంలో శిలువ యాత్ర నిర్వహించారు. ఈ యాత్ర లో భాగంగా శిలువ వేయటానికి ముందు జీసస్ ఏ విదంగా 14 స్థలాలలో భధింపబడ్డారో దృశ్యలను క్రైస్తవ దీక్ష పరులు, శిలువ మోస్తూ జీసస్ వేష ధారణ వున్న కవిటి రాజు వీదుల్లో ప్రదర్శిస్తూ, మహిళలు పాటలు పడుతూ శిలువ యాత్ర ను క్రైస్తవ సోదరులు నిర్వహించారు. పాప పరిహారానికి ఈ శిలువ యాత్ర అని, ప్రపంచ సమస్త జీవరాశికి శాంతి కై ప్రభువు మరణించారని, పాపులను పరిశుద్దులుగా చేయడానికి తన రక్తం ను జీసస్ ధారపోశారని, ఏసు పుట్టుక, మరణం రెండు చాలా గొప్పవని ఫాదర్ చార్లెస్ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోపింటి రాజేశ్వరి, రాజేష్, జడ్డెయ్య, చరణ్, ప్రసాద్, కాంతారావు పాల్గొన్నారు.

మధుపాడ క్షేత్ర సహాయకరాలుగా భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలోని మధుపాడ గ్రామ పంచాయతీ క్షేత్ర సహాయకురాలుగా కే.భాగ్యలక్ష్మిను శనివారం ఎంపీపీ బెల్లాన జ్ఞాన దీపిక జడ్పిటిసి గార తౌడు సర్పంచ్ పైడుపునాయుడు ఎంపీటీసీ స్వామి నాయుడు చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బెల్లాన త్రినాధరావు ఏపీవో సిహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

20వ డివిజన్లో 'గడపగడపకూ మన ప్రభూత్వం'

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్ లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ఆ డివిజనకు చేరుకున్న ఆయనకు స్థానికులు, వైసీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాలతో కూడిన బుక్లెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదర్శ పాలన అందిస్తున్నారన్నారు. అందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల ముంగిటకు ధైర్యంగా వెళుతున్నామని చెప్పారు. ప్రజలు కూడా అదే రీతిన సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని చెప్పారు. లంచగొండితనం మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకి పథకాల నిధులు జమ అవుతున్నాయని అన్నారు. స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ తమ డివిజన్లో అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని దీంతో ప్రజలంతా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సుమారు 300 మంది వరకు ఇళ్ళ పట్టాలు పొందారని అన్నారు. అలాగే వృద్ధాప్య, వితంతు పింఛన్లు అర్హత ఉంటే చాలు అన్ని పథకాలు అందే విధంగా ఉండడంతో ప్రజలు స్వచ్ఛందంగా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాలనతో పాటు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తమ డివిజన్లో చేస్తున్న అభివృద్ధి ఎంతగానో ప్రజలకు ఉపయుక్తంగా ఉంటున్నాయన్నారు. నగరంలో అభివృద్ధి సరవేగంగా సాగుతోందని, నగర అందాలు మరింత ఇనుమడింప చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, డివిజన్ అధ్యక్షులు పచ్చిగుళ్ళ కృష్ణమూర్తి, కాళ్ళ సూరిబాబు, మహిళా అధ్యక్షురాలు గుండు విమల, గుండు శ్రీను, యువజన అధ్యక్షులు సుధీర్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు క్రాస్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - గజపతినగరం : వేసవిలో నీటి ఎద్దడి నివారణకు క్రాస్ ప్రోగ్రామ్ దోహదపడుతుందని గజపతినగరం ఎంపీపీ జ్ఞాన దీపిక జడ్పిటిసి గార తవుడు లు అన్నారు శనివారం గజపతినగరం గ్రామీణ నీటి పారుదల శాఖ కార్యాలయం వద్ద క్రాస్ ప్రోగ్రాం వారు జండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పప్పు సుదర్శనం గ్రామీణ నీటి పారుదల శాఖ ఏఈ నాని బాబు వైస్ ఎంపీపీలు గెద్ద దమయంతి కర్రి శ్రీదేవి గజపతినగరం ఉప సర్పంచ్ కర్రి రామునాయుడు వైసీపీ నాయకులు బెల్లాన త్రినాధరావు కర్రీ నానాజీ తదితరులు పాల్గొన్నారు

ఎంఈఓ త్రినాధరావు పరీక్ష కేంద్రాల తనిఖీ

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో శనివారం 10.వ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలను ఎంఈఓ జే.తిర్నాధరావు సందర్శించారు.తేదీ.03.04.23 నుండి తెర్లాం మండలం లో గల 03 పరీక్షా కేంద్రాల లో పరీక్షలు నిర్వహించడం జరుగు తుంది అని,తెర్లాం జెడ్పీహెచ్ స్కూల్, పెరుమాళి జెడ్పీహెచ్ స్కూల్ , పెరుమాళి ఏపీ మోడల్ స్కూల్ లో పరీక్షలు నిర్వహించడం జరుగు తుంది అని తెలిపారు.ఈ పరీక్షల నిర్వహణ కోసం అన్ని కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, పరీక్షల నిర్వహణ సిబ్బంది, త్రాగు నీటి సౌకర్యం, బెంచీల ఏర్పాటు, లైట్స్ %ు% ఫ్యాన్స్ , మరుగు దొడ్ల సౌకర్యం మొదలగు అంశాలు పరిశీలించి తగు సూచనలు చేసారు.పరీక్షలు ప్రశాంతంగా ,ఏవిధమైన తప్పిదములు జరుగకుండా సమర్థవంతంగా నిర్వహణ చేయాలని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను మరియు డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ను కోరారు. పరీక్షల నిర్వహణ కోసం ముగ్గురు సీఎస్ లను ,ముగ్గురు డీఓ లను, 28మంది ఇన్విజిలేటర్ లను నియమించడం జరిగింది అని తెలిపారు.పరీక్షలు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు నిర్వహించబడతాయి, విద్యార్థులు నిర్ణీత సమయం నకు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల ను చేరుకోవాలని సూచించారు.పరీక్షల నిర్వహణ కోసం పోలీస్ బందోబస్తు, వైద్య సౌకర్యం, ఆర్టీసీ ద్వారా ఉచిత రవాణా సౌకర్యం కల్పించడం జరిగింది అని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏవిధమైన ఎలక్ట్రానిక్ వస్తువులు గానీ, సెల్ ఫోన్లు గానీ ఇతరత్రా ఏవిధమైన పత్రాలు గానీ తీసుకు రాకూడదని ఎమ్ ఈ ఓ జే.తిర్నాధరావు తెలియ చేసారు.

మహిళా మార్టును సందర్శించిన పీడీ కళ్యాణ్చక్రవర్తి

విశాలాంధ్ర- గరివిడి : ఈరోజు గరివిడి లో గల చేయూత మహిళా మార్ట్ని ప్రాజెక్ట్ డైరెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సందర్శించడం జరిగింది. మార్ట్లో గల సరుకులు మరియు నాణ్యత లు పరిశీలించి మహిళలకు సిబ్బందికి తగు సూచనలు చేయటం జరిగింది. అలాగే సరుకులు ఆన్లైన్ నమోదు ఎలా చేస్తున్నారో పరిశీలించడం జరిగింది. సరుకుల నాణ్యతతో ఎటువంటి రాజీ లేకుండా మహిళలు అందరికీ అవగాహన కల్పించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కె.సావిత్రి, చేయూత రవికుమార్, ఏరియా కో ఆర్డినేటర్ జి.సీతారామయ్య, పద్మ, ధనలక్ష్మి, మార్ట్ అధ్యక్షురాలు ఎం.పద్మ పాల్గొన్నారు.

వసుధైక కుటుంబ సాధనలో యువత పాత్ర కీలకం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : మనదేశం ఒక వైవిధ్యభరితమైన ప్రదేశం అని అందులో వివిధ మతాలూ, కులాలు, అలవాట్లు, వేషభాషలు ఉన్నాయని వాటి పరిధిని అధిగమించిన వసుధైక కుటుంబం అనేది మరింత విస్తృతమైనదని దానిని సాధించి సమ సమాజ నిర్మాణం చేయడం లో యువత పాత్ర ఎంతో కీలకం అని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య తేజస్వి కట్టిమని పిలుపునిచ్చారు. ఆజాదికా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని వివేకా నంద ఫర్ కల్చర్ యోగ అండ్ మానేజ్మెంట్ ఒరిస్సా వారి సౌజన్యంతో (సి - 20) సివిల్ సోసిటీ ఆధ్వర్యంలో జి 20 సదస్సు లో సమర్పించడానికి అవసరమైన వివిధ అంశాలను చర్చించి డ్రాఫ్ట్ తయారుచేయు ఉద్దేశ్యంతో ఈ రోజు కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం లో వర్క్ షాప్ నిర్వహించారు. ఇందులో భాగంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి వి కట్టిమని మాట్లాడుతూ సమాజం లో అందరు కలిసిమెలిసి సంతోషంగా ఉండాలని ఒకరికి ఒకరు సహకారం అందించుకొని మానవ మనుగడకు సహకరించుకోవాలని భగవద్గీతలో మరియు ఉపనిషత్తులలో ఇదే విషయాన్ని తెలిపారని అన్నారు. ప్రతిఒక్కరు తమ హక్కులను గురించి మాట్లాడడమే కాకుండా తమ భాద్యతలను కూడా నిబద్ధతతో నిర్వహించాలని కోరారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు వసుధైక కుటుంబం (యూనివర్సల్ ఫామిలీ) సాధనకు వివిధ సలహాలు సూచనలతో కూడిన ప్రెసెంటేషన్స్ ఇచ్చారు. కుసుమ్ సమన్వయ కర్త గా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి అరుణాచల్ ప్రదేశ్ వివేకానంద కేంద్ర జీవన వర్తి కార్యకర్త లక్ష్మి నారాయణ, సుజాత, వివేకానంద ఫర్ కల్చర్ యోగ అండ్ మానేజ్మెంట్ ఒరిస్సా ఆంధ్ర ప్రదేశ్ ప్రాంత కార్యకర్త రవి, ప్రొ.మిశ్రా, ప్రొ.శరత్ చంద్ర బాబు, ప్రో. శ్రీనివాసన్ డా.అప్పాసాభా తదితరులు పాల్గొన్నారు.

యువత భవిష్యత్తు అంధాకారంలోకి నెట్టేసిన జగన్

విశాలాంధ్ర - గజపతినగరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేసారని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ కే ఏ నాయుడు అన్నారు గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ ని విడుదల చేస్తామని ప్రగల్భాలు పలికారని రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు రాక ఉపాధి లేక నిరుద్యోగ యువత పక్క రాష్ట్రాలకు వలస వెళ్లి పోవలసిన పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేక గత మూడు ఏళ్లలో చాలామంది నిరుద్యోగులు ఆత్మహత్యకు పాల్పడ్డారని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని తెలిపారు గతంలో చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన 17 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను తరిమారని తద్వారా 34 లక్షల ఉద్యోగాలు యువత కోల్పోయిందని అన్నారు ఉద్యోగాలు పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు ఈ సమావేశంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మీనాయుడు పార్టీ నాయకులు జి గోవిందరావు ప్రదీప్ కుమార్ వేమలి చైతన్య బాబు మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి రామన్నపేట సర్పంచ్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయండి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు

విశాలాంధ్ర - గుర్ల : బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలసికట్టుగా పనిచేసి పూర్తిస్థాయిలో అదుపు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. అధికారులు ఉదాసీనంగా ఉండటం వల్ల బాల్య వివాహాల నిర్మూలన అమల్లో విఫలమవుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గుర్లలోని ఎంపీడీవో కార్యాలయంలో మహిళ శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ బాల్య వివాహాలకు మూల కారణాలను విశ్లేషించుకోవాలన్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలపై మరింత అవగాహన రావాలన్నారు. డిసిపిఓ సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. జెడ్పీటీసీ ఎస్. అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడం ద్వారా మరింత అవగాహన కల్పించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువు, క్రమశిక్షణ కలిగి ఉండాలని ఎంపీపీ పి.ప్రమీలా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కళ్యాణి, సీడీపీఓ ఆరుద్ర, డిటి సూర్య నారాయణ, ఎస్సీసీసీ జిల్లా కోఆర్డినేటర్ బి.రామకృష్ణ, వైస్ ఎంపీపీ టి.తిరుపతిరావు, అంగన్వాడీ సూపర్వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బోగితల్లి పండుగకు బొబ్బిలి రాజులకు ఆహ్వానం అందజేత

విశాలాంధ్ర - సీతానగరం : సీతానగరంలో మే నెల 8,9,10 తేదీలలో జరగబోవు శ్రీ శ్రీశ్రీ భోగితల్లి అమ్మవారి పండగకు బొబ్బిలి రాజులు,తెలుగుదేశం పార్టీ నియోజకవర్గం ఇంచార్జి బేబీనాయన గారిని, మాజీమంత్రి సుజయ్ నాయన లను రావాలని కోరుతూ సీతానగరం పెద్దలు శనివారం సాయంత్రం బొబ్బిలి కోటకు వెళ్ళి ఆహ్వానించారు. పండుగకు తప్పని సరిగా రావాలని వారంతా కోరుతూ సహకారాన్ని అందించాలని కోరారు.ఈకార్యమంలో చెలికాని వెంకట గోపాల కృష్ణ, సాల హరిగోపాల్, మమ్ముల విశ్వేశ్వరరావు, ఎస్ ప్రసాద్,సత్యనారాయణ, తేరేజమ్మ,అరవింద్, బుడితి శ్రీను, సబ్బాన శ్రీను, సుంకరి అప్పారావు, నాయుడు, పిన్నింటి రామారావు, మరిసి వెంకన్న, సీతానగరం, అప్పయ్యపేట, బుడ్డి పేట గ్రామపెద్దలు ఆహ్వాన సంఘం సభ్యులు పాల్గొన్నారు.అక్కడ నుండి విచ్చేసిన వారంతా స్తానిక పోలీస్ స్టేషన్ కు వెళ్లి పండుగ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్ ఐ నీలకంఠంను కోరారు. మూడు రోజుల పాటు వాహనాలు మళ్లింపు, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ' జై భారత్ సత్యాగ్రహ' కార్యక్రమం

విశాలాంధ్ర - బొబ్బిలి : నియోజకవర్గం బొబ్బిలి పట్టణం జై భారత్ సత్యాగ్రహ కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి పట్టణం లో గల తారకరామా కాలనీ అంబేద్కర్ బొమ్మ కార్యక్రమం పిసిసి మెంబర్ మరియు బొబ్బిలి పట్టణ అధ్యక్షులు ఆధ్వర్యంలో చేపట్టడం జరిగింది పిసిసి మెంబర్ మొగుడు వెంకటరమణ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మి నాయుడు గారు కాంగ్రెస్ కార్యకర్తలు మండపాక శ్రీనివాసరావు శ్రీనివాసరావు, వజ్జల శ్రీనివాసరావు, కృష్ణమోహన్ రఘు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులతో బోరుబావి ఏర్పాటు

విశాలాంధ్ర - వేపాడ :- మండలంలోని అరిగి పాలెం గ్రామంలో మండల పరిషత్ నుండి మంజూరైన నిధులతో ఎంపీటీసీ సభ్యులు తొండవరపు వెంకటరమణ, వైసిపి నాయకులు దుల్ల సన్యాసిరావు ఆధ్వర్యంలో శనివారం బోరు బావి తవ్వించడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీటీసీ వెంకటరమణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా నిధులను వెచ్చించి ప్రజలకు త్రాగునీరు అందిస్తుందన్నారు. వైసిపి నాయకుడు దుల్ల సన్యాసిరావు మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్న తరుణంలో మండల పరిషత్ నుండి నిధులు మంజూరు చేసి బోరుబావి ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్ బాబా దర్బార్లో.. ఘనంగా 9వ రోజు ఇఫ్తియార్ లంగర్

విశాలాంధ్ర - విజయనగరంటౌన్ : పవిత్ర రంజాన్ తొమ్మిదో రోజు ఉపవాస దినాన్ని పురస్కరించుకుని హజరత్ ఖాదర్ బాబా ఔలియా దర్గా దర్బార్ షరీఫ్ లో శనివారం సాయంత్రం ' ఇఫ్తియార్ లంగర్ ' ఘనంగా జరిగింది. దర్గా దర్బార్ షరీఫ్ ధర్మకర్త డా.ఎం.డీ. ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ(ఖలీల్ బాబు) ప్రేమ పూర్వక ఇఫ్తార్ దావత్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఖాదర్ బాబా అన్న ప్రసాదాన్ని అందించారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో ప్రాంగణ ఎంపికలు

విశాలాంధ్ర - గరివిడి : స్థానిక గరివిడి, అవంతి సెయింట్ థెరీసా ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం ఉదయం డిప్లొమా బి.టెక్ ఫైనల్ ఇయర్ విభాగానికి చెందిన విద్యార్థులకు గ్రూప్ కు చెందిన ప్రముఖ మెకానికల్,ఎలక్ట్రికల్ " కోర్ కంపెనీ " "వీల్స్ ఇండియా లిమిటెడ్ "చెన్నై, డిప్యూటీ మేనేజర్ ఎ.దివాకర్ గారు ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ ప్రాంగణ ఎంపికలకు అవంతి విద్యా సంస్థలు, ఇతర కాలేజీలు మరియు గరివిడి కాలేజీ నుండి 256 మంది విద్యార్థులు హాజరయ్యారు.కంపెనీ డిప్యూటీ మేనేజర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పరీక్ష , ఇంటర్వ్యూ వంటి ప్రతిభ పరీక్షలు నిర్వహించి 61 మంది ఎంపిక చేసి జాయినింగ్ ఆర్డర్ అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేనేజర్ గారు మాట్లాడుతూ ఈ కంపెనీ 1962 లో స్థాపించబడిందని తెలిపారు. భారతదేశంలో 15 బ్రాంచ్ లు ఉన్నాయని తెలుపుతూ, ఆంధ్రప్రదేశ్ లో చిత్తూరు జిల్లా సత్యవేడు లో ఒక బ్రాంచ్ ఉందని తెలిపారు. భారతదేశం మొత్తం 9,000 ఎంప్లాయిస్ పని చేస్తున్నారని, 4200 కోట్లు టర్నవర్ చేస్తుందని తెలిపారు. కంపెనీ ఉత్పత్తులు భారతదేశంలో పాటు జర్మనీ, ఆస్ట్రేలియా వంటి తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. డాక్టర్ జాషువ జయప్రసాద్ మాట్లాడుతూ ఈ కంపెనీలో విద్యార్థి యొక్క సామర్థ్యాన్ని బట్టి 2.5 నుండి 4 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందని, ఈ ఎంపికైన విద్యార్థులు ప్రోడక్ట్ డెవలప్మెంట్ ఇంజనీర్ గా,క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్గా, ప్రోసస్ కంట్రోల్ ఇంజనీర్ గా పని చేస్తారని తెలిపారు. ప్రస్తుతం సాఫ్ట్ వేర్ అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రాంగణ ఎంపికలుకు ఇటువంటి హార్డ్ వేర్ కోర్ కంపెనీ రావడం శుభపరిణామం తెలిపారు. ఈ ఎంపికైన విద్యార్థులుకు అభినందనలు తెలియజేస్తూ, రానున్న రోజుల్లో గరివిడి క్యాంపస్ లో మరెన్నో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే విద్యార్థులు కూడా ప్రణాళిక బద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలు పూర్తిగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువ జయప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఏ.ఓ జి.అనిల్ కుమార్, కాలేజీ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ ఎన్.చంద్రశేఖర్, ఎమ్.మనోజ్ కుమార్ పర్యవేక్షణలో జరిగాయి.